


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 25-07-2025 సంపుటి : 07 సంచిక : 75 పేజీలు : 8 వెల : రూ 3-00





భారత్-బ్రిటన్ సంబంధాల్లో ఇవాళ(గురువారం) చరిత్రాత్మక రోజు అని ప్రకటించారు భారత ప్రధాని నరేంద్ర మోదీ. చాలా ఏళ్ల కృషి తర్వాత భారత్-బ్రిటన్ మధ్య సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందంపై సంతకాలు జరగడం సంతోషకరమన్నారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీ అంశాల్లో ఇరుదేశాలు కలిసి ముందుకు సాగుతామని మోదీ చెప్పారు. బ్రిటన్, భారత్ భాగస్వామ్యంలో కొత్త అధ్యాయం ప్రారంభమైందని కూడా మోదీ తెలిపారు. భారత్‌లో త్వరలో ఆరు బ్రిటన్ వర్సిటీలు తమ క్యాంపస్‌లు ఏర్పాటు చేస్తున్నాయని ప్రధాని మోదీ చెప్పారు. ఇరుదేశాల సేవల రంగం.. ఆర్థిక, సాంకేతిక రంగాలకు ఊతమిస్తుందని మోదీ అన్నారు. ఈ ఒప్పందం ద్వారా సులభతర వాణిజ్య విధానానికి మరింత ఊతం వచ్చిందని వ్యాఖ్యానించారు. 'ఇరుదేశాల మధ్య ఉపాధి కల్పన అవకాశాలు విస్తృతం అవుతాయి. భారత్-బ్రిటన్ భాగస్వామ్యంలో విజన్-2035 లక్ష్యంగా సాగుతున్నాం' అని మోదీ తెలిపారు.

# విజయవాడ, విశాఖలో మెట్రో రైలు నిర్మాణం..

## టెండర్లు ఆహ్వానానికి ముహూర్తం ఖరారు

అమరావతి, జులై 24: ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన నగరాలైన విజయవాడ, విశాఖపట్నంలో మెట్రో రైలు నిర్మాణానికి చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది. వీటి నిర్మాణానికి సంబంధించిన టెండర్లు పిలిచేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఆ క్రమంలో ప్రభుత్వం శుక్రవారం టెండర్లు పిలవనుంది. రూ.21,616 కోట్లతో విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టులకు టెండర్లను ఆహ్వానించనుంది.అందులో రూ. 10,118 కోట్లతో విజయవాడ, రూ. 11,498 కోట్లతో వైజాగ్ మెట్రోలకు టెండర్లు పిలవనున్నారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. ఫిఫ్టీ, ఫిఫ్టీ భాగస్వామ్యంతో నిర్మించనున్నారు. వైజాగ్ మెట్రో రైలుకు విఐఎంఎంఆర్డీఏ నుంచి రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ. 4,101 కోట్ల నిధులు మళ్లించనున్నారు. అలాగే



విజయవాడ మెట్రోకు సీఆర్డీఏ నుంచి రూ.3,497 కోట్లు రాష్ట్ర ప్రభుత్వ వాటాగా నిధులు మళ్లించనున్నారు.

# తెలంగాణలో చేపట్టిన సర్వే దేశానికి ఆదర్శం కావాలి: ఖర్గే

ఢిల్లీ: తెలంగాణలో శాస్త్రీయంగా నిర్వహించిన సామాజిక, ఆర్థిక సర్వే దేశానికి ఆదర్శం కావాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఉద్ఘాటించారు. తెలంగాణ సర్వే ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికలు, విద్యాసంస్థల్లో ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సిఫారసు చేస్తోందని తెలిపారు. బీసీ బిల్లు ప్రస్తుతం రాష్ట్రపతి ఆమోదం కోసం ఎదురు చూస్తోందని వెల్లడించారు. ఈ చారిత్రాత్మక ప్రయత్నంలో కృషి చేసిన విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి



నేతృత్వంలోని బృందానికి కృతజ్ఞతలు తెలిపారు మల్లికార్జున ఖర్గే.కాంగ్రెస్ అధ్యక్షుడు, తెలంగాణ సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రిమండలి, ఎంపీలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్(టీ)లో మల్లికార్జున ఖర్గే పోస్ట్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ సామాజిక న్యాయం 2.0 ఉద్యమాన్ని ప్రారంభించిందని చెప్పుకొచ్చారు. బలహీన వర్గాల కోసమే ఈ న్యాయ పోరాటమని నొక్కిచెప్పారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ నిరంతర పోరాటం చేస్తోందని ఉద్ఘాటించారు. దశాబ్దాలుగా పక్కకు నెట్టివేయబడిన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల ప్రజల గళంగా కాంగ్రెస్ పనిచేస్తోందని స్పష్టం చేశారు మల్లికార్జున ఖర్గే.దేశ జనాభాలో మెజార్టీ సంఖ్య అయినా? కార్పొరేట్ బోర్డులు, న్యాయవ్యవస్థ, బ్యూరోక్రసీ, ఉన్నత విద్యాసంస్థల్లో వర్ణహీనత కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర విశ్వవిద్యాలయాల్లో కూడా అన్యాయం జరుగుతోందని.. ఈ విషయాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించారని గుర్తుచేశారు. 80 శాతం ఓబీసీ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని.. అలాగే 83 శాతం ఎస్టీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. దేశవ్యాప్తంగా జాతీయ కుల గణాంకాల సమీక్ష జరపాలని డిమాండ్ చేశారు. ప్రజల ఒత్తిడికి లోనై కులగణనకు మోదీ ప్రభుత్వం అంగీకారం తెలిపిందని... కానీ 50 శాతం రిజర్వేషన్ పరిమితిని ఎందుకు తొలగించలేదని మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు.




హైదరాబాద్: హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. వర్షం దెబ్బకు రోడ్లన్నీ జలమయమయ్యాయి. దీంతో మాదాపూర్, మియాపూర్, నాలెడ్జ్ సిటీ ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ నెలకొంది. వర్షంతో పలు ప్రాంతాల్లో రోడ్లపైకి వరద నీరు చేరింది. హైటెక్ సిటీ ఫ్లైఓవర్‌పై వాహనాలు నిలిచిపోయాయి. ఒక వాహనం బ్రేక్‌డౌన్ కావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వర్షపు నీటితో ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం నెలకొంది. మియాపూర్ ఆల్విన్ కాలనీ-బొల్లారం చౌరస్తా వరకు వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఢిల్లీలో ఉన్న ముఖ్యమంత్రి సీఎంవో అధికారులతో మాట్లాడారు. భారీ వర్షాలు కురిసిన ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని, లోతట్టు ప్రాంతాల్లో తగిన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు సీఎం రేవంత్‌రెడ్డి.గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నందున చెరువులు, కుంటలు నిండి వరదనీటి ఉధృతి ఉన్న ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్దేశించారు. భారీ వర్షసూచన ఉన్న జిల్లాల్లో కలెక్టర్లు అన్ని విభాగాలతో ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. ఎక్కడా ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు ముఖ్యమంత్రి. వర్షాలు, వరదలతో ఎలాంటి పరిస్థితి వచ్చినా ఎదుర్కొనేందుకు, ఎలాంటి సహాయమైనా అందించేందుకు అధికారులు జిల్లాల్లోనే అందుబాటులో ఉండాలని మార్గనిర్దేశం చేశారు. ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో మాట్లాడి ఎప్పుడికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.ఖమ్మం జిల్లాలోని మున్నేరులో ఐదుగురు పశువుల కాపరులు చిక్కుకున్నారు. పశువులను మేపడానికి ఉదయం మున్నేరు లంకలోకి కాపరులు వెళ్లారు. చింతకాని మండలం చిన్నమండవ వద్ద మున్నేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోండటంతో పశువుల కాపరులు చిక్కుకుపోయారు. మున్నేరులో చిక్కుకున్న పశువుల కాపరుల అంశంపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పందించారు. పశువుల కాపరులను కాపాడేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. క్షేమంగా ఒడ్డుకు చేర్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి తుమ్మల దిశానిర్దేశం చేశారు.

# లిక్కర్ స్కాంలో తవ్వాల్సింది చాలా ఉంది

విజయవాడ, జూలై 24, లిక్కర్ స్కాం లో సిట్ విచారణ కొండను తవ్వి ఎలకను పట్టినట్లుందని ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల వ్యాఖ్యానించారు. ఎంతసేపు డిస్టిలరీ ల చుట్టే విచారణ సాగుతుంది.. లిక్కర్ స్కాం వెనుక కమిషన్లు మాత్రమే చూపుతున్నారన్నారు. కానీ క్యాష్ రూపంలోనే లావాదేవీలు నిర్వహించి.. పన్నులు చెల్లించని మద్యాన్ని పెద్ద ఎత్తున అమ్మారని ఆరోపించారు. డెన్ లు ఉన్నాయని, కిక్ బ్యాగ్స్ అందాయని,నెలకు 50 నుంచి 60 కోట్లు ముడుపులు అందాయని అంటున్నారు.. లిక్కర్ స్కాం ఇంతకే పరిమితం కాదని స్పష్టం చేశారు. లిక్కర్ స్కాం లో 3500 కోట్లు మాత్రమే కాదున్నారు. డిస్టిలరిల దగ్గర నుంచి కన్జ్యూమర్ వరకు మద్యం చేరడం మొత్తం కుంభకోణం మే .. లిక్కర్ స్కాంలో ప్రపంచంలో ఎక్కడ లేని అవినీతి జరిగిందని స్పష్టం చేశారు. డిజిటల్ పేమెంట్స్ లేకుండా ఓన్లీ క్యాష్ పద్ధతి ప్రపంచంలో ఆంధ్ర రాష్ట్రంలో మాత్రమేనని.. డిజిటల్ పేమెంట్స్ ఉండాలని చెప్పే ఈ యుగంలో కూడా ఓన్లీ క్యాష్ అనడం బహుశా ఎక్కడా జరగలేదన్నారు. ఓన్లీ క్యాష్ పద్ధతిలో మద్యం అమ్మకాలు చేసింది అనధికార అమ్మకాల కోసమేనని.. నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ ను భారీగా అమ్మారు .. అనధికార మద్యం అమ్మి వేల కోట్లు దోచేశారన్నారు. అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు లిక్కర్ స్కాం మీద శ్వేతపత్రం ఇచ్చారని.. లక్ష కోట్ల మద్యం అమ్మకాలు జరిగితే డిజిటల్ పేమెంట్స్ కేవలం 600 కోట్లు వచ్చాయన్నారు. 99 వేల కోట్లు ఎక్కడ పోయాయో తెలియదు అన్నారని. ఒక్క శాతం కూడా లిక్కర్ సొమ్ము ప్రభుత్వానికి రాలేదు అన్నారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో చేసిన ఆరోపణలో విచారణ జరపాల్సి ఉందని డిమాండ్ చేశారు. లక్ష కోట్ల లిక్కర్ స్కాం పై నిజాలు నిగ్గు తేల్చాలన్నారు. జలఖ హయంలో ట్రస్టెడ్ లిక్కర్ అమ్మలేదు.. హానికరమైన మద్యాన్ని అమ్మారు .. అటువంటి కంపెనీలకే అనుమతులు ఇచ్చారు.. రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యంతో చెలగాటం



ఆడుకున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో 30 లక్షల మందికి కిడ్నీ,లివర్ సమస్యలు వచ్చాయని కూటమి ప్రభుత్వం చెప్పింది. రాష్ట్రంలో హానికరమైన మద్యాన్ని తాగి 30 వేల మంది వరకు చనిపోయారని చెప్పారు. లక్షల మందికి నరాల బలహీనత సమస్యలు వచ్చాయని మీరు నియమించిన కమిటీలు రిపోర్ట్ ఇచ్చాయి. ఈ అంశంపై కూడా దర్యాప్తు జరగాలన్నారు. క్యాష్ పద్ధతిలో ఎందుకు అమ్మకాలు చేశారో విచారణ జరగాలి... ట్రస్టెడ్ కంపెనీ ల లిక్కర్ ను ఎందుకు నిషేధించారో విచారణ జరగాలి..లిక్కర్ విచారణ సందర్భంగా జగన్ ను సూటిగా ప్రశ్నిస్తున్నామన్నారు. జగన్ కి అవసరం అయిన వాటిని మాత్రమే సమాధానం చెప్తారు.. ఆయనకు హాని అనుకున్నవి మాత్రం నోరు విప్పరని మండిపడ్డారు. రుషికొండ ను ఎందుకు గొరిగారో చెప్పలేదు ? వివేకా హత్య విషయంలో సాక్షి గుండెపోటు అని చెప్తే దానికి సమాధానం చెప్పలేదని గుర్తు చేశారు. రక్తపు మడుగులో వివేక హత్య జరిగితే హార్ట్ ఎటాక్ అని కథలు అల్లారని మండిపడ్డారు. సమాధానం చెప్పాల్సిన పాయింట్ ను పక్కన పెట్టీ చుట్టూ ఉన్న అంశాలు మాట్లాడటం జగన్ కి అలవాటన్నారు.

# బెయిల్ పిటిషన్ దాఖలు చేసిన మిథున్‌రెడ్డి

విజయవాడ: వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి లాయర్లు ఏసీబీ కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. లిక్కర్ స్కాం కేసులో ఏ4గా ఉన్నారు మిథున్‌రెడ్డి. ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఆయన ఉన్నారు.కాగా, లిక్కర్ స్కాం కేసులో నిందితుల బెయిల్ పిటిషన్లని వాయిదా వేసింది ఏసీబీ కోర్టు. ఈ కేసులో ఏ31 ధనుంజయ రెడ్డి, ఏ32 కృష్ణ మోహన్‌రెడ్డి, ఏ33 బాలాజీ గోవిందప్ప బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. కౌంటర్ దాఖలు చేయాలని సిట్‌కు ఆదేశాలు జారీ చేశారు న్యాయమూర్తి. తదుపరి విచారణ ఈ నెల(జులై) 29వ తేదీకి ఏసీబీ కోర్టు వాయిదా వేసింది.మరోవైపు.. మద్యం ముడుపుల కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగింది. శ్రావణి డిస్టిలరీస్ డైరెక్టర్ చంద్రారెడ్డికి నోటీసులు పంపించారు ఈడీ అధికారులు. ఖఓఒం చట్టం కింద కేసు దర్యాప్తు చేస్తున్నారు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్. ఈ నెల (జులై) 28వ తేదీ ఉదయం 10:30 గంటలకు హైదరాబాద్‌లోని తమ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని నోటీసులు ఇచ్చారు. జగన్ సీఎంగా ఉన్న సమయంలో ఆంధ్రా గోల్డ్ బ్రాండ్ పేరిట భారీగా మద్యం తయారీ చేసినట్లు గుర్తించారు.ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ నుంచి ఆంధ్రా గోల్డ్ బ్రాండ్ భారీగా కొనుగోళు చేసినట్లు అధికారుల విచారణలో తేలింది. ఇప్పటికే సిట్, ఈడీ అధికారులు మద్యం కేసుకు సంబంధించి పూర్తి సమాచారం సేకరించారు. ఇక వరుసగా దర్యాప్తు ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే సిట్ ప్రిలిమినరీ చార్జిషీట్ వేయడంతో ఇక దర్యాప్తు ప్రారంభించాలని ఈడీ అధికారులు తుది నిర్ణయం తీసుకున్నారు.




# సంపాదకీయం

శుక్రవారం 25-07-2025

## మేకిన్ ఇండియా సక్సెస్ స్టోరీ

ఓవైపు రష్యా – ఉక్రెయిన్ యుద్ధం జరుగుతోంది. మరోవైపు ఇజ్రాయెల్ – పాలస్తీనాల మధ్య వార్ సాగుతోంది. ఇజ్రాయెల్ – ఇరాన్ల మధ్య పరిమిత యుద్ధం జరిగింది. ఇదే సమయంలో ఇండియా – పాకిస్థాన్‌ల మధ్య కూడా యుద్ధం జరిగింది. అయితే, మిగతా యుద్ధాల్లో జరగని చర్చ ఇండియా – పాకిస్థాన్ యుద్ధం తర్వాత జరుగుతోంది. అదే ఆయుధాల వినియోగం. రష్యా ఉక్రెయిన్ కన్నా బలమైన దేశం. ఇజ్రాయెల్ యుద్ధ సన్నద్ధత, ఆయుధ వ్యవస్థల విషయంలో పాలస్తీనా, ఇరాన్ కన్నా బలమైన దేశం. కానీ ఈ రెండు దేశాలు తమ ప్రత్యర్థులపై దాడులు చేసే క్రమంలో వారి బలంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. రష్యా రెండేళ్లుగా ఉక్రెయిన్‌పై యుద్ధం చేస్తున్నా, ఆ యుద్ధంలో విజయం సాధించలేకపోతోందన్నది ప్రధాన ఆరోపణ. ఇక ఇజ్రాయెల్ ఐరన్ డోమ్ ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందినప్పటికీ, ఇరాన్ వేసిన కొన్ని రాకెట్లను అడ్డుకోలేకపోయిందన్న వాదన వినపడింది. బ్రహ్మోస్ క్షిపణులు ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా మన దేశం పాకిస్థాన్‌పై తొలిసారిగా బ్రహ్మోస్ క్షిపణులను ప్రయోగించింది. ఇది ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణిగా గుర్తింపు ఉంది. భారత్ – రష్యా సంయుక్తంగా ఈ మిస్సైల్‌ను డిజైన్ చేసినప్పటికీ, మన దేశ సాంకేతికత, డిజైన్, తయారీలో భాగస్వామ్యం ఎక్కువగా ఉంది. ఈ క్షిపణికి మన దేశంలోని బ్రహ్మపుత్ర నది పేరును, రష్యాలోని మోస్క్వా నది పేర్లను కలిపి ఈ క్షిపణికి బ్రహ్మోస్గా నామకరణం చేశారు. ఈ మిస్సైల్ వేగం, కచ్చితంగా పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలు, కమాండ్ సెంటర్లను ధ్వంసం చేయడంలో కీలకంగా పనిచేశాయి. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా మన దేశీయంగా (డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్) అభివృద్ధి చేసిన రక్షణ వ్యవస్థ. ఇది సర్ఫేస్-టు-ఎయిర్ క్షిపణి వ్యవస్థ. ఇది మధ్య శ్రేణి క్షిపణులను, తక్కువ ఎత్తులో వచ్చే శత్రు డ్రోన్‌లను అడ్డుకునేందుకు వినియోగిస్తారు. దీని తయారీలో డీఆర్‌డీవోతో పాటు భారత్ డైనమిక్స్ లిమిటెడ్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు కలిసి ఉత్పత్తి చేశాయి. ఆకాష్ ఎయిర్ డిఫెన్స్ మిస్సైల్స్ 25 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం ఉంది. దీని వేగం సూపర్ సోనిక్ వేగంతో ప్రయాణిస్తుంది. అంటే శబ్దం కంటే 2.5 రెట్లు ఎక్కువ వేగంతో ప్రయాణించే క్షిపణి వ్యవస్థగా చెప్పవచ్చు. దీనికి ఉన్న మరో ప్రత్యేకత ఏంటంటే, ఇది డ్రోన్‌లు, యుద్ధ విమానాలను, హెలికాప్టర్లను, వాటితో పాటు క్రూయిజ్ క్షిపణులను కూడా అడ్డుకోగలదు. అంతేకాదు, ఒకేసారి బహుళ లక్ష్యాలను ఛేదించగలిగే సామర్థ్యం ఆకాష్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థకు ఉంది. ఇందులో ఏర్పాటు చేసిన రాజేంద్ర అనే రాడార్ వ్యవస్థ మల్టీపుల్-ఫంక్షన్ ఫేజ్డ్-అరే రాడార్ను వినియోగిస్తుంది. ఈ రాడార్ వల్ల ఒకేసారి అనేక టార్గెట్‌లను ఇది ట్రాక్ చేయగలదు. అప్పటికప్పుడు ఆ లక్ష్యాలను ఛేదించేందుకు ఆకాష్ క్షిపణులకు డైరెక్షన్ ఇవ్వగల సామర్థ్యం ఉంది. దీని ద్వారా పాకిస్థాన్ మన సరిహద్దుల నుండి ప్రయోగించిన డ్రోన్‌లను గుర్తించి, వాటిని జామ్ చేసి, ధ్వంసం చేయడంలో కీలక పాత్ర పోషించాయి. సైనిక స్థావరాలతో పాటు డ్రోన్ దాడుల నుండి ప్రజలను, వారి ఆస్తులను కాపాడటంలో విశేషంగా పనిచేశాయని చెప్పాలి. సరిహద్దులను దాటి వచ్చే డ్రోన్‌లను గుర్తించడం, వాటిని జామ్ చేసి ధ్వంసం చేయడం ఈ డీ4 యాంటీ-డ్రోన్ సిస్టమ్స్ పని. మన దేశంలోని కీలక సైనిక స్థావరాలు, వ్యూహాత్మక ప్రాంతాలు, నగరాలు, పట్టణాలను శత్రు డ్రోన్‌ల నుండి కాపాడే రక్షణ వ్యవస్థగా దీన్ని రూపొందించారు. తక్కువ రాడార్ క్రాస్ సెక్షన్ ఉన్న చిన్నపాటి డ్రోన్‌లను కూడా గుర్తిస్తుంది. డ్రోన్‌ల కమాండ్ అండ్ కంట్రోల్ సిగ్నల్‌లను, అలాగే సిగ్నల్‌లను గుర్తించి, ట్రాక్ చేస్తుంది. పగలు, రాత్రి తేడా లేకుండా డ్రోన్‌లను గుర్తించి నిర్ధారించడానికి, ట్రాక్ చేయడానికి ఇందులో ఏర్పాటు చేసిన ఎలక్ట్రో-ఆప్టికల్/ఇన్‌ఫ్రారెడ్ సెన్సార్లు ఉపయోగపడతాయి. ఇక ఇందులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ అల్గోరిథంలను వాడి, ఏ లక్ష్యాన్ని గుర్తించిందో ఆ టార్గెట్ ఉద్దేశాన్ని, ముప్పు ఎక్కడ ఉంది, ఏ స్థాయిలో ఉందని అంచనా వేసి, తదనుగుణంగా వేగంగా నిర్ణయాలు తీసుకోగల సామర్థ్యం ఉంది. ఇది కృత్రిమ మేధస్సుతో కూడిన గగనతల నియంత్రణ, నివేదన వ్యవస్థగా చెప్పవచ్చు. ఏఐ ఆధారిత వ్యవస్థ. దీన్ని డీఆర్‌డీవో, ఇస్రో, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ సంయుక్తంగా అభివృద్ధి చేసిన వ్యవస్థే ఆకాష్ తీర్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ. ఇది కేవలం ఒక క్షిపణి వ్యవస్థగా చెప్పలేం. ఇది వైమానిక స్థావరాలు, రక్షణ సంస్థల ఆస్తులను శత్రువుల దాడుల నుంచి కాపాడుతుంది. శత్రువుల దాడులను ట్రాక్ చేయడం, వాటికి ప్రతిస్పందించడంలో సహాయం చేసే పాత్ర ఆకాష్ తీర్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ ప్రత్యేకత. వివిధ రక్షణ వ్యవస్థల నుంచి అంటే రాడార్లు, క్షిపణి వ్యవస్థలు, శాటిలైట్స్ నుండి వచ్చే సమాచారం సేకరించి, వాటిని పరిశీలించి, అవసరమైన సమాచారాన్ని ప్రాసెస్ చేసి అందిస్తుంది. ఇందులో ఉపయోగించే ఏఐ టెక్నాలజీ ద్వారా డ్రోన్‌లు, క్షిపణులు, విమానాలను ట్రాక్ చేసి గుర్తించడం, వాటిని ఎదుర్కొనేందుకు తక్షణ నిర్ణయాలను తీసుకుంటుంది. సాధారణ ఎయిర్ డిఫెన్స్‌లతో పోల్చితే ఆకాష్ తీర్ చాలా వేగంగా లక్ష్యాలను గుర్తించి, వేగంగానే నిర్ణయాలు తీసుకుంటుంది. మానవ ప్రమేయం లేకుండానే శత్రు టార్గెట్‌లను గుర్తించి, వాటిని అడ్డుకునేందుకు రక్షణ వ్యవస్థలకు ఆదేశాలు ఇవ్వగల సామర్థ్యం ఈ వ్యవస్థ ప్రత్యేకత. డ్రోన్ స్వార్మ్ అంటే ఒకే లక్ష్యాన్ని ఛేదించేందుకు ఎక్కువ సంఖ్యలో వచ్చే డ్రోన్‌లను అడ్డుకుని నియంత్రించగల సామర్థ్యం ఆకాష్ తీర్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థకు ఉంది. పిస్టన్ డ్రోన్ అనేది పిస్టన్ ఇంజిన్‌తో నడిచే డ్రోన్. డ్రోన్‌లు సాధారణంగా ఎలక్ట్రిక్ మోటార్ల ద్వారా నడిచేలా తయారవుతాయి. ఇందుకు బ్యాటరీలను వినియోగిస్తారు. అయితే, పిస్టన్ డ్రోన్‌లు వాడే ఎలక్ట్రిక్ మోటార్లతో కాకుండా పెట్రోల్ లేదా ఇతర ద్రవ ఇంధనాలతో పని చేసే పిస్టన్ ఇంజిన్‌ను వినియోగిస్తారు.

# కేటీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే గండ్ర దంపతులు.



### బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా బర్త్ డే వేడుకలు. రక్తదానం చేసిన మాజీ ఎమ్మెల్యే గండ్ర.

జయశంకర్ భూపాలపల్లి, జూలై 24, తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఏమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన వేడుకను భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి మరియు వరంగల్ జిల్లా జడ్పీ మాజీ ఛైర్పర్సన్ ఢ భూపాలపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి గురువారం భూపాలపల్లి లో ఘనంగా నిర్వహించారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు ఏర్పాటు చేసిన పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్ని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి రక్తం దానంచేసి, అనంతరం కేక్ కట్ చేసి, కేటీఆర్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియచేశారు. అనంతరం గండ్ర జ్యోతి బిఆర్ఎస్ పార్టీ నాయకులతో భూపాలపల్లి జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. గణపురం మండలం, చెల్పూర్ గ్రామ మాజీ సర్పంచ్ మధుసూదన్ రావు ఆధ్వర్యం లో చెల్పూర్ బస్ స్టాండ్ సెంటర్లో ఏర్పాటు చేసిన కేటీఆర్ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్ని, కేక్ కట్ చేసి, స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో మరియు భారత రాష్ట్ర సమితి పార్టీని సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లడానికి భగవంతుడు ఆశీర్వాదం ఇవ్వాలని కోరుకుంటూ ఆ దేవుని ప్రార్థిస్తూన్నా. కేటీ రామారావు ఈరోజు చాలామంది నాయకులకు కొడుకులు ఉంటారు కానీ తండ్రి తగ్గ తనయుడిగా పోరాట పటిమతో తెలంగాణ రాష్ట్రం సాధించడంలో క్రియాశీలక పాత్ర పోషించిండు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కూడా కేటీఆర్ అదే పద్ధతిలో తెలంగాణ రాష్ట్రానికి కేటీఆర్ కీలకమైనట్టు వంటి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అదేవిధంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇండస్ట్రీస్ మంత్రిగా తెలంగాణ రాష్ట్ర యొక్క రూపు రేఖలు మార్చినటువంటి గొప్ప నాయకుడు. తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ విశ్వ నగరంగా కావడానికి ఎంతో కృషి చేశారు. నేను ఈ మధ్యకాలంలోనే అమెరికా పర్యటన చేసి వచ్చిన అమెరికా కంటే కూడా మన హైదరాబాదేం తక్కువ కాదు అమెరికాలో ఒక పట్టణం లో రెండు హై టవర్స్ ఉంటాయి. కానీ మనం ఈరోజు హైదరాబాద్లో వెస్ట్ సైడ్ పోతే మొత్తం కూడా పెద్ద పెద్ద ఆకాశాన్ని అందుకునేటువంటి టవర్లు ఉన్నాయి. ఈరోజు హైదరాబాదు అనేక పారిశ్రామిక రంగాలకు సెంటర్ పాయింట్గా ఈరోజు ఎంతో మందికి ఉపాధిని ఇచ్చేటువంటి కార్యక్రమాలు ఆయన 10 సంవత్సరాల కాలంలో ఎంతో చొరవ చూపెట్టి ప్రపంచంలో అనేక పెద్ద సంస్థ లైనట్టువంటి మైక్రోసాఫ్ట్ గాని, గూగుల్ గాని అదేవిధంగా ఎన్నెన్నో పెద్ద సంస్థలన్నీ కూడా హైదరాబాద్ తీసుకొచ్చి, అదేవిధంగా ఫార్మా రంగంలో కూడా ఎన్నో పెద్ద పరిశ్రమలు ఇక్కడ తీసుకురావడంతో పాటు ఒక పెద్ద సిటీ ఉండాలి అని ఒక ఫార్మా సిటీని కూడా పెద్ద మొత్తంలో ల్యాండ్ సేకరించి పరిశ్రమలు పెట్టడానికి ఎంతో ముందు చూపునటువంటి నాయకుడు మన వరంగల్ జిల్లాలో కూడా కాకతీయ టెక్స్టైల్ పార్కును ఈరోజు మన ప్రాంతం నుంచి భీమండికి అదేవిధంగా ఎక్కడెక్కడకు మహారాష్ట్ర, బొంబాయి ప్రాంతాల్లో కెళ్ళి ఉద్యోగాలు చేసుకోవడం ఎందుకు మన బిడ్డలు మన దగ్గర చేసుకోవాలని ఉద్దేశంతోటి ఒక మెగా టెక్స్ టైల్స్ ఏర్పాటు చేశారు. మన భూపాలపల్లి పట్టణాన్ని కూడా వారు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ మంత్రిగా ఉండి దాదాపు ఒక 50 కోట్ల రూపాయలు తోటి డ్రింకింగ్ వాటర్ సమస్య గురించి గానీ, ఈరోజు మన ప్రాంతంలో ఉండేటువంటి వాళ్లకు ఆడుకోవడానికి క్రీడా ప్రాంగణాలు గానీ మార్కెట్లో ఈరోజు అవసరాలు పెరుగుతా ఉంటే ఎక్కడికక్కడ మరి కూరగాయల వెజిటేబుల్ సెంటర్ పెట్టుకోడానికి గాని ఇట్లా అనేక కార్యక్రమాలు ఈరోజు భూపాలపల్లి యొక్క దిశను దశను మార్చినటువంటి నాయకుడు. మనకు మెడికల్ కాలేజ్ రావడానికి కూడా ప్రత్యేక చొరువ తీసుకొని అది వచ్చే వరకు చూసినటువంటి నాయకుడు. భూపాలపల్లి లో ట్రాఫిక్ని దృష్టిలో పెట్టుకొని ఒక బైపాస్ రోడ్డు రావడానికి కూడా సహకరించినటు వంటి నాయకుడు మన కేటీఆర్. మరి యువకుడుగా మరి యువకుల్లో యువకుడిగా పెద్దల్లో పెద్దవాడిగా అందరిలో అందరి వాడిగా ఉండి ఈరోజు ప్రసంశలు పొందుతున్నారు. ఈ రోజు బి ఆర్ ఎస్ పార్టీ కుటుంబ సభ్యులతో కలిసి ఆయన జన్మదినాన్ని జరుపుకోవడం చాలా సంతోషం. మీ అందరూ కూడా పాల్గొని దానాల కంటే మిన్న రక్తదానమే మిన్న అని నేడు ఏర్పాటు చేసిన రక్తదాన శిభిరంలో పాల్గొన్ని రక్త ధానం చేసిన మీ అందరికీ ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియచేశారు. అదే విధంగా ఈ నెల 27 తేదీన కేటీఆర్ భూపాలపల్లి నియోజక వర్గాన్నికి విచ్చేస్తున్న సందర్భంగా ప్రతి ఒక్కరూ ఇట్టి కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమంను విజయ వతం చేయాలని కోరారు.

# మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్థిక చేయూత

### హుజురాబాద్ బస్ స్టాండ్ సందర్శన,సమస్యలు పరిష్కరిస్థాం ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తాం బిజెపికి టచ్ లో కౌశిక్ ప్రణవ్

హుజురాబాద్:జూలై 24, ( ) ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే మహాలక్ష్మి పథకాన్ని అమలు చేసి మహిళలకు ఆర్థికంగా చేయూతనిస్తున్నామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. గురువారం రోజున హుజురాబాద్ పట్టణంలోని బస్ స్టాండ్ ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా బస్ స్టాండ్ లో ఉన్న పలు సమస్యలు ప్రణవ్ దృష్టికి తీసుకురాగా వాటిని సంబంధిత మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి,పరిష్కరిస్తానని తెలిపారు. అనంతరం ప్రణవ్ మీడియాతో మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం పెట్టిన తర్వాత ఇప్పటివరకు 200 కోట్ల మంది మహిళలకు ఉచిత టికెట్ లను ఇచ్చామని,6,800 కోట్ల ప్రయాణ చార్జీలను మహిళలు ఆదా చేసుకున్నారని,ఇదొక చరిత్ర అని అన్నారు. హుజురాబాద్ డిపో పరిధిలో దాదాపు 1,34,02,821మందికి సుమారు 53 కోట్లు ప్రయాణ ఛార్జీలను మహిళలు ఆదా చేసుకున్నారని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్లలో చేయలేని అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం 18 నెలల్లో చేసి చూపెట్టింది అన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ప్రభుత్వానికి మంచి పేరు వచ్చిందని,విమర్శించనవారే కితాబు ఇస్తున్నారని అన్నారు. మహిళలను ఆర్థికంగా చేయూత ఇవ్వాలనే ఉద్దేశ్యంతో మహిళా సంఘాలకు బస్ నడుపుకునే సౌకర్యాన్ని ప్రభుత్వం నుండి కల్పించామని అన్నారు. విజయవంతంగా పథకాన్ని నడిపిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రి పొన్నం ప్రభాకర్ కు కృతజ్ఞతలు తెలిపారు. దళిత బంధు ఆపి దళిత బంధు విషయంలో కౌశిక్ రెడ్డి డ్రామాలు ఆడుతున్నాడని,ఉప ఎన్నికల సమయంలో ప్రారంభమైన దళిత బంధు పథకం హుజురాబాద్ నియోజకవర్గంలో అందరికి ఇవ్వకుండా కౌశిక్ రెడ్డి కుట్రలు చేశారని అన్నారు. ప్రభుత్వ విప్ గా,ఎమ్మెల్సీ గా ఉండి ఆనాడు దళిత బంధు ఎందుకు ఇవ్వలేదో సమాధానం చెప్పాలని అన్నారు. కేవలం ఓట్ల రాజకీయం కోసం వారిని వాడుకున్నారే తప్ప వారి అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోపే దళిత సంఘాల నాయకులకు ఇచ్చిన మాట మేరకు ప్రభుత్వ పెద్దలకు ఈ సమస్యపై పలు దఫాలు చర్చించగా గత జనవరిలో ఫ్రీజింగ్ ఎత్తివేశామని, ప్రభుత్వంలో ఉండి చేయలేక ఇప్పుడు మా ప్రభుత్వం చేస్తుంటే కౌశిక్ రెడ్డి ఓర్వలేకపోతున్నాడని,దళితులు ఎవరు అధైర్యపడిద్దని, ఆలస్యమైన అర్హులైన ప్రతి లబ్ధిదారునికి దళిత బంధు నిధులు అందజేస్తామని, ఇచ్చాడా అని ప్రశ్నించారు? కట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కూడా పంచలేదని,ఇప్పుడు ప్రజా ప్రభుత్వంలో 3500 ఇళ్లను మొదటి విడతగా అందజేశామని,బేస్మెంట్ వరకు పూర్తైన ఇళ్లకు డబ్బులు కూడా పడ్డాయని, మొదటి కౌశిక్ రెడ్డి కళ్ళు పెద్దగా చేసి చూస్తే ప్రభుత్వం చేసే సంక్షేమ పథకాలు కనిపిస్తాయని అన్నారు. కట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను త్వరలో మరమ్మతులు చేసి లబ్ధిదారులకు అందిస్తామని అన్నారు. సన్నబియ్యం,రేషన్ కార్డులు,ఆరోగ్య శ్రీ,రైతు భరోసా,రుణమాఫీ,200 యూనిట్ల ఉచిత విద్యుత్ లాంటి పథకాలు ప్రజలకు ఉపయోగపడుతున్నాయని అన్నారు. బీజేపీ నాయకులు బండి సంజయ్,ఈటల రాజేందర్ మధ్య జరుగుతున్న అంతర్గత పార్టీ విషయాల్లో కౌశిక్ రెడ్డి దూరడం చూస్తే బీజేపీ ట్రాప్ లో కౌశిక్ రెడ్డి పడుతున్నాడని అందుకే బండి సంజయ్ కు మద్దతుగా మాట్లాడుతున్నాడని ప్రణవ్ ఆరోపించారు.

బీజేపీ,బీఆర్ఎస్ దొందూ దొందే అని ఎలక్షన్ నుండి చెప్తున్న అని ఇప్పుడు కౌశిక్ రెడ్డి మాట్లాడడం చూస్తుంటే నిజమని తెలుస్తుందని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 5 మండలాల్లో,2 పట్టణాల్లో కాంగ్రెస్ జెండా ఎగరేస్తామని అన్నారు. హుజురాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా రెపరెపలాడుతుందనీ ధీమా వ్యక్తం చేశారు.

# ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

**-ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ : యు ఎస్ పి సి**

మందమర్రి జూలై 24, (న్యూస్ పల్స్)ఈ రోజు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యు ఎస్ పి సి)మందమర్రి మండలం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికై నిర్వహించే దశలవారీ పోరాటంలో భాగంగా మందమర్రి మండల తహసీల్దార్ గారి ద్వారా గౌరవ ముఖ్యమంత్రి గారికి వినతి పత్రాలు సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా యుఎస్ పి సి సంఘాల నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని,బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని, పిఆర్సి ని ప్రకటించి అమలు చేయాలని, పెండింగ్ డీఏ లను వెంటనే చెల్లించాలని, సిపిఎస్ ను రద్దుచేసి, ఓ పి ఎస్ ను అమలు చేయాలని, 317 జీవో వల్ల నష్టపోయిన ఉపాధ్యాయులందరినీ, వారి వారి సొంత జిల్లాలకు పంపించాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపచేయాలని, సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని,ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులందరికీ పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని, ఉపాధ్యాయుల సర్దుబాటు జిఓ 25ను సవరించాలని, సమగ్ర శిక్ష ఉద్యోగుల 29 రోజుల సమ్మె కాలపు జీతాన్ని వెంటనే చెల్లించాలని, టైం స్కేల్ ఇవ్వాలని, వివిధ గురుకులాల్లో విధులు నిర్వహిస్తున్న గెస్ట్, పార్ట్ టైం ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు కనీస వేతనం ఇవ్వాలని, నూతన జిల్లాలకు డిఈఓ పోస్టులను, ప్రతి రెవెన్యూ డివిజన్‌కు డిప్యూటీ ఈఓ, నూతన మండలాలకు యంఈఓ పోస్టులను మంజూరు చేసి, ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు రూల్స్‌ను రూపొందించి, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయలని, ఉపాధ్యాయుల, పెన్షనర్ల, వివిధ రకాల బిల్లులను వెంటనే విడుదల చేయాలని, ప్రాథమిక పాఠశాలలకు 5571 పియస్ హెచ్‌యం పోస్టులను మంజూరు చేయాలని, పండిట్, పిఈటిల అప్ గ్రేడేషన్ ప్రక్రియ పూర్తి అయినందున జిఓ 2,3,9,10 లను రద్దు చేసి జిఓ 11,12 ల ప్రకారం పదోన్నతులు కల్పిం చాలని,ఉపాధ్యాయుల సర్దుబాటు మార్గదర్శకాలను సవరించాలని, వివిధ జిల్లాల్లో జరిగిన పైరవీ డిప్యూటేషన్లను వెంటనే రద్దు చేయాలని, గురుకుల టైం టేబుల్ సవరించాలని, కెజిబివి, మోడల్ స్కూల్స్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని, పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని, గిరిజన సంక్షేమ, ఆశ్రమ పాఠశాలలోని పండిట్, పిఇటి పోస్టులను అప్ గ్రేడ్ చేసి వెంటనే పదోన్నతులు ఇవ్వాలని, ఉపాధ్యాయులను పర్యవేక్షణ అధికారులుగా నియమించాలనే ఉత్తర్వులను ఉపసంహరించాలని, విద్యారంగంలో ఎన్ జి ఓ జోక్యాన్ని నివరించాలని, శానిటేషన్ గ్రాంట్స్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఘనంగా వొడితల రాజేశ్వర్ రావు 14వ వర్థంతి వేడుకలు

### తాత ఆశయాలను కొనసాగిస్తా ప్రజలకు మరింత సేవ చేసేందుకు కృషి చేస్తా

హుజురాబాద్/జులై 24 కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వొడితల రాజేశ్వరరావు 14 వర్థంతిని గురువారం పట్టణంలోని సైదాపూర్ క్రాస్ రోడ్ లో ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ? రాజ్యసభ సభ్యునిగా,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకునిగా అనేక సేవలు అందించిన మహోన్నత వ్యక్తి అని,వారి బాటలో నడుస్తూ ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. పేద కుటుంబంలో జన్మించిన వారు విద్యకు దూరం కావొద్దని ఆలోచించిన వ్యక్తి రాజేశ్వర్ రావు అని,ఆనాటి ప్రధానమంత్రి పి.వీ.నరసింహరావుకు చేదోడు వాదోడుగా ఉండి ఆపద సమయంలో దేశ రాజకీయాల్లో తన వంతు సహాయం చేసి రాజకీయ చతురత ప్రదర్శించారని ఆయన సేవలు గుర్తు చేసుకున్నారు. తాత వారసుడిగా ఆయన ఆశయాలను కొనసాగిస్తూ విద్య,వైద్య విషయంలో ముందుండి పేద ప్రజలకు మరింత సేవ చేస్తానని తెలిపారు. అనంతరం పార్టీ కార్యాలయంలో వారి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వర రావు అభిమానులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వచ్చే నెల నుంచి ఒంటిమిట్టలో మూడుపూటల అన్నప్రసాదం

బద్వేలు వచ్చే నెల నుంచి ఒంటిమిట్టలో మూడుపూటల అన్నప్రసాదంఆంధ్రప్రదేశ్ : భక్తులకు శుభవార్త. తిరుమలలో అన్ని కార్యాలయాలు ఒకే చోట ఉండేలా పరిపాలన భవనం నిర్మించాలని టీటీడీ నిర్ణయించింది.పాలకమండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆలయ ఈవో శ్యామలరావు మీడియాకు తెలిపారు. 700 మంది వేదపారాయణదారులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఆగస్టు నెల నుంచి మూడు పూటలు ఒంటిమిట్టలోని కోదాండరామాలయంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

# మారంపల్లిలో ఉద్యోగులకు వీడ్కోలు, స్వాగతం



తాడేపల్లిగూడెం,జూలై 24 పశ్చిమగోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం మండలం, మండలం మారంపల్లి గ్రామంలో బుధవారం సచివాలయ ఉద్యోగులకు స్వాగతం, వీడ్కోలు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఇప్పటివరకు ఈ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పని చేసిన మహమ్మద్ అహ్మద్ మరియు వెల్ఫేర్ సెక్రెటరీగా పని చేసిన జి. శివ లు తేతలి గ్రామంలోని రెండవ సచివాలయానికి బదిలీపై వెళ్లారు. అలాగే బదిలీలలో భాగంగా పి. సరస్వతి మారంపల్లి పంచాయతీ కార్యదర్శిగా వచ్చి ఇక్కడ నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. దీంతో బదిలీపై వెళ్తున్న అహ్మద్, శివ లకు వీడ్కోలు తో పాటు కొత్త సెక్రెటరీ సరస్వతికి స్వాగతం పలికారు. వారి సేవలను కొనియాడారు. ఇంతకాలం ఈ గ్రామంలో పని చేసి బదిలీపై వెళుతున్న ఉద్యోగులు భావోద్వేగానికి గురయ్యారు. వారిని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సరిపల్లి పద్మ, ఉప సర్పంచ్ సరిపల్లి చిట్టిబాబు, కూటమి నాయకులు మిద్దె కనకారావు, తోట సూర్యనారాయణ, నిడదవోలు రాజేశ్వరి, రేఖ వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ కల్లేపల్లి వెంకట బలరామకృష్ణంరాజు, లక్ష్మీపతి రాజు, పంచాయతీ బోర్డు మెంబర్లు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బి.మఠం వేమారెడ్డి అన్నదాన సత్రం నందు సమావేశమైన వైఎస్ఆర్సిపి నాయకులు..

## హాజరైన జిల్లా పరిషత్ ఛైర్మన్ రామగోవిందరెడ్డి..

బ్రహ్మంగారిమఠం –మండల కేంద్రంలోని యోగి వేమారెడ్డి అన్నదాన సత్రంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం గురువారం జరిగినది. సమావేశానికి ముఖ్యఅతిథిగా భీమటం జడ్పిటిసి సభ్యుడు, కడప జిల్లా జడ్పీ చైర్మన్ ముత్యాల రామ గోవిందరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ మాట్లాడుతూ 26వ తేదీ శనివారం రోజున బాబు షూరిటీ మోసం గ్యారంటీ లో భాగంగా సమావేశం జరుగుతున్నదని ఈ సమావేశానికి కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి గారు, కడప జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోచం రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, తో పాటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం కమిటీ చైర్మన్ ,మైదుకూరు మాజీ శాసనసభ్యులు శెట్టిపల్లి రఘురామిరెడ్డి హాజరుకానున్నారని ఆయన తెలిపారు. కాబట్టి బ్రహ్మంగారి మఠం మండలంలోని అన్ని పంచాయతీల నుంచి సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు వార్డు మెంబర్లు పార్టీ మండల అధ్యక్షుడు తో పాటు వివిధ అనుబంధాల సంఘాల సభ్యులు తోపాటు కార్యకర్తలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభిమానులు ప్రజలు తదితరులు పెద్ద ఎత్తున హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఈ సమావేశానికి దగ్గరుండి కార్యకర్తలను తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు . ఈ సమావేశానికి పార్టీ అధ్యక్షుడు రత్నకుమార్ యాదవ్,మాజీ సహకార సంఘం చైర్మన్ నేలటూరి సుబ్బారెడ్డి,సర్పంచులు పెద్దిరెడ్డి ఓబుల్ రెడ్డి,వాక మల్ల అనంతరెడ్డి,మాజీ ఎంపీటీసీ పసుపులేటి రామయ్య,యువ నాయకులు పసుపులేటి వెంకటేష్, భూమిరెడ్డి బాలకృష్ణారెడ్డి,సర్పంచ్ సుదర్శన్ రెడ్డి,బిజి వేముల మోహన్ రెడ్డి,బసిరెడ్డి దుగ్గిరెడ్డి,కనుపర్తి నాగేశ్వర్ రెడ్డి,శీలం పెద్దిరెడ్డి,యత్తపు సుబ్బారెడ్డి,జోగయ్య,బండి సుబ్బరాజా,గురుమూర్తి, వివేక,నాగార్జున,శివారెడ్డి, సోమయ్య,మదిరెడ్డి పల్లె రమణారెడ్డి,యూత్ రమణారెడ్డి,ఎంపిటిసి లు ఈశ్వర్ రెడ్డి,మనోహర్,రామగురువి రెడ్డి,భాస్కర్ రెడ్డి,మాజీ ఎంపిటిసి వెంకటయ్య,చక్రపాణితో సహా కార్యకర్తలు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు మధ్యలో పెద్ద గొయ్యి... ద్విచక్రవాహనదారులు ఇక్కట్లు

పత్తికొండ పత్తికొండ పట్టణం లో ఆది నారాయణ రెడ్డి కాలనీ ఎదురుగా రోడ్డు మధ్యలో పెద్ద గొయ్యి , ఏర్పడటంతో ద్విచక్రవాహనదారులు, పట్టణవాసులు గ్రామాలకు వెళ్లే వాళ్ళు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్రావణమాసం ప్రారంభం కావడంతో ఎక్కువ ఉరుకుంద వీరన్న స్వామి వెళ్లే వారు, అటువైపు వెళ్లే వాహనాలు వందలాది మంది వెళ్తూ ఉంటారు కొంచెం పట్టించుకోండి మహాప్రబులు అని పట్టణవాసులు గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి ఏర్పడిన గొయ్యి పూడ్చాలని కోరుతున్నారు.

# లిక్కర్ స్కాం కేసులో శ్రవణ్ రావు... విచారిస్తున్న సిట్ అధికారులు

విజయవాడ, జూలై 24, ఆంధ్రప్రదేశ్‌లో వెలుగు చూసిన లిక్కర్ స్కామ్ అనేక మలుపు తిరుగుతోంది. దేశ సరిహద్దులను కూడా దాటిపోతోంది. ఇందులో తెలంగాణలోని కీలక వ్యక్తుల పాత్ర కూడా వెలుగు చూస్తోంది. తాజాగా ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న శ్రవణ్‌రావు లిక్కర్ స్కామ్‌లో కూడా జోక్యం చేసుకున్నట్టు తేలింది. దీంతో ఆయనకు నోటీసులు ఇచ్చిన సిట్ అధికారులు విచారణకు పిలిచారు. సిట్ పిలుపు మేరకు శ్రవణ్‌రావు విజయవాడలో విచారణకు హజరయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో వెలుగు చూసిన లిక్కర్ స్కామ్‌లో డబ్బులను హవాలా రూపంలో చేతులు మారినట్టు సిట్ తేల్చింది. ఇలాంటి డబ్బులను మార్చేందుకు చాలా పెద్ద నెట్‌వర్క్ పని చేసిందని మొన్న కోర్టుకు సమర్పించిన ఛార్జ్‌షీట్‌లో పేర్కొంది. ఇలాంటి నెట్‌వర్క్‌లోని కీలక వ్యక్తులకు ఈ శ్రవణ్‌కుమార్ షెల్టర్ ఇచ్చినట్టు స్పష్టమైంది. దుబయ్‌లో తనకు ఉన్న ఫ్లాట్‌లోనే నిందితులుగా ఉన్న చాణక్య, కిరణ్‌కు ఆశ్రయం ఇచ్చారని తేల్చారు. ప్రస్తుతం శ్రవణ్ రావు తెలంగాణలో దర్యాప్తు జరుగుతున్న ఫోన్ ట్యాపింగ్‌లో కేసులో కీలక నిందితుడిగా ఉన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఐటీ సలహాదారుగా పని చేసిన శ్రవణ్‌రావు ఆంధ్రప్రదేశ్‌లో లిక్కర్ స్కామ్‌లో జోక్యం చేసుకున్నారని సిట్ అధికారులు అనుమానిస్తున్నారు. అందుకే ఆయనకు రెండు రోజుల క్రితం నోటీసులు ఇచ్చారు. గురువారం విచారణకు రావాలని ఆదేశించారు. దీంతో ఆయన ఇవాళ విచారణకు హాజరయ్యారు. లిక్కర్ ద్వారా వచ్చిన సొమ్మును దుబయ్ చేరవేయడంలో కిరణ్‌కుమార్ కీలక పాత్ర పోషించారని సిట్ ఇప్పటికే ఛార్జ్‌షీట్‌లో పేర్కొంది. కిరణ్‌తోపపాటు చాణక్య కొరియర్లుగా వ్యవహరించాలని తెలిపింది. కిరణ్ అనేవ్యక్తి ఇప్పటి వరకు 29 సార్లు దుబయ్ వెళ్లినట్టు కూడా తెలిపింది. వెళ్లినప్పుడల్లా శ్రవణ్ ఫ్లాట్‌లోనే ఉన్నట్టు నిర్ధారించారు. దాన్ని షెల్టర్‌గా లిక్కర్ స్కామ్ నిందితులు వాడుతున్నట్టు తేల్చారు. వీళ్లంతా ఆ ఫ్లాట్‌లో ఉన్నప్పటికీ ఖాళీగా ఉన్నట్టే శ్రవణ్ చూపించారని స్పష్టమైంది. దీంతో ఆయన్ని పిలిచి ఈ విషయాలపై ప్రశ్నిస్తున్నారు. శ్రవణ్ కేవలం ఫ్లాట్ అద్దెకు ఇచ్చారా లేకుంటే హవాలలో కూడా ఆయన పాత్ర ఉందా అనే కోణంలో ప్రశ్నిస్తున్నారు. అక్కడకు వచ్చిన తర్వాత కిరణ్, చాణక్య ఏం చేసేవాళ్లు. వీళ్లతో ఆయనకు ఏమైనా ఆర్థిక లావాదేవీలు జరిగాయా అనే విషయంపై ఆరా తీస్తున్నారు. ఇప్పటికే ఆ ఫ్లాట్‌లో వీళ్లు ఉన్నట్టు సాంకేతిక ఆధారాలు సేకరించిన అధికారులు వాటిని ఆయన ముందు పెట్టి ప్రశ్నించనున్నారు. బ్యాంకు అకౌంట్ వివరాలు కూడా చెక్ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. మద్యం కుంభకోణంలో ప్రధాన నిందితుడైన రాజ్ కసిరెడ్డికి కూడా శ్రవణ్‌కుమార్‌కు సాన్నిహిత్యం ఉందని తేలింది. ఆ వివరాలపై కూడా కూపీ లాగతున్నారు.

# బంగారం షాపుల్లో నైన్త్ స్టూడెంట్స్ దొంగతనం

విజయవాడ, జూలై 24, వేరు వేరు దొంగాతనాలకు పాల్పడిన నలుగురు నిందితులను అరెస్ట్ చేసి.. వారి నుంచి 100 గ్రాముల బంగారం, 700 గ్రాముల విలువైన వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు మచిలీపట్నం పోలీసులు. ఈ నెల 6వ తారీఖున ఖీఅ కాలనీ, మచిలీపట్నంలో మహంకాళి గురుతేజ శర్మ నివాసంతో పాటు పక్కన ఇంట్లో అద్దెకు ఉంటున్న మోపిదేవి వెంకట సత్య శ్రీనివాసు నివాసంలో దొంగతనం జరిగింది. రాత్రి 7 గంటల సమయంలో ఇంటికి తాళం వేసి.. హోమం నిర్వహించేందుకు కొజ్జిలిపేట వెంకటేశ్వరస్వామి గుడికి వెళ్ళగాతిరిగి రాత్రి 9 గంటలకు ఇంటికి వచ్చాడు. అతడు వచ్చేసరికి ఇంటి తాళం పగలకొట్టి బీరువాలో బంగారం, డబ్బులు కొట్టేశారు నిందితులు. ఇక పక్కన ఉన్న మరో ఇంట్లోకి దూరి.. అక్కడ కూడా బంగారం, డబ్బులు దొంగతనం చేశారు. రెండు కేసులను చాలెంజింగ్‌గా తీసుకున్న పోలీసులు.. టెక్నాలజీ సహాయంతో శ్రీనివాసనగర్ కాలనీ, బందరుకు చెందిన మైనర్లు దొంగతనం చేశారని తెలిసి షాక్ అయ్యారు. దొంగతనం చేసిన కొక్కిలిగడ్డ రాము, వల్లూరు సంతోష్, చిలకలపూడి పాండురంగను స్కూల్ వద్ద అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసి, చోరీ చేసిన బంగారం, వెండి వస్తువులను స్వాధీనం చేసుకుని జువైనల్ హోమ్‌కు తరలించారు.దొంగతనం చేసిన తీరు గురించి ఆరా తీసిన పోలీసులు యుట్యూబ్‌లో చూసి దొంగతనాలు చేసినట్లు గుర్తించారు. 9వ తరగతి చదువుతున్న ముగ్గురు మైనర్లు.. వరుసగా ఇళ్లలో దొంగతనాలకు పాల్పడ్డారు. దొంగతనం చేయడానికి ఏ ఇళ్లను ఎంచుకోవాలి.? తాళాలు ఎలా కట్ చేయాలి.?బీరువాను ఎలా బ్రేక్ చేయాలి.? పోలీసులకు దొరక్కుండా ఎలా దొంగతనం చేయాలి.? దొంగతనం చేసాకా ఎలా ఎస్కేప్ అవ్వాలో కూడా యూట్యూబ్‌లో నేర్చుకున్నారు. దీనితో వారి ముగ్గురు తెలివితేటలు చూసి షాక్ అయిన పోలీసులు.. టెక్నాలజీ సహాయంతో పట్టేశారు. దొంగతనాలు చేసి వాటితో జల్సాలు చేయడం, బెట్టింగ్‌లకు పాల్పడటం.. వృత్తిగా మార్చుకున్న మైనర్లను అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించారు.

# ఐక్య ఉద్యమాలే విజయానికి తొలిమెట్టు : సిఐటియు



అద్దంకి జులై 24 (ఆంధ్ర రేఖ ప్రతినిధి) తొమ్మిది రోజుల నిరవధిక సమ్మె ఇంజనీరింగ్ కార్మికుల గొంతు వినేందుకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించేందుకు కొద్దో గొప్పో ఫలితం సాధించేందుకు తోడ్పడిందని మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ నాయకులు ఉసురుపాటి శామ్యూల్ అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో సమ్మె కాలంలో పడిన కష్టసుఖాలను పంచుకున్నారు. సిఐటియు నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం ఎలాంటి చర్చలు జరుపుకుండా ఏకపక్షంగా జీవో నెంబర్ 124 విడుదల చేసిందని తద్వారా వివిధ కేటగిరీల కింద జీతం 3000 మాత్రం పెరుగుతుందని మన ప్రధానమైన ఇతర డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించ లేదన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మునిసిపల్ ఇంజనీరింగ్ వర్కర్ కు అమలయ్యేలా నిర్ణయం తీసుకోలేదని, కనీస వేతనం అమలు చేయలేదని, వివిధ కేటగిరీల విధానాన్ని సవరించలేదని కేవలం నామినల్ గా జీతం మాత్రమే పెంచిందని ఆయన అన్నారు. కార్మికులంతా ఐక్యంగా సాగించిన సమ్మె పోరాట ఫలితమే జీతం పెంపు కార్యక్రమాన్ని ఇది తొలి విజయం మాత్రమేనని సాధించుకోవాల్సిన హక్కులు, బెనిఫిట్స్ ఇంకా చాలా ఉన్నాయని రాబోయే కాలంలో వివిధ దశలలో అవి సాధించుకోవటానికి కార్మికులంతా ఐక్యంగా ఉండి ఉద్యమించాలన్నారు. ప్రజల అవసరాలను అర్థం చేసుకొని సామాజిక బాధ్యతగా సీఐటీయూ రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు సమ్మె నుండి విధుల్లోకి వచ్చిన విషయాన్ని అధికార యంత్రాంగం గుర్తించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమ్మె కాలంలో సంపూర్ణంగా ప్రత్యక్షంగా పరోక్షంగా సహకరించిన వివిధ ప్రజారంగాల కమిటీలకు అధికార యంత్రాంగానికి మున్సిపల్ పాలకవర్గానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి తిరుపతిరెడ్డి ఆర్ కోటేశ్వరరావు వి జాన్, జి పెద్ద మార్క్, కే మారుతి, ఎం కోటయ్య, ఏ గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

# 14 నెలల కూటమి పాలనలో అభివృద్ధి లేదు..

**1.86వేలకోట్లఅప్పుచేశారు.**

**కడప జిల్లా వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షుడు పి రవీంద్రనాథ్ రెడ్డి**



కడప రాష్ట్రంలో 14 నెలల తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి మాత్రం లేదు కానీ 1.86 వేల కోట్ల రూపాయలు అప్పు చేశారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. కడప వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచిన అన్ని హామీలను మరిచారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు అందాల్సిన అరియర్స్ కూడా ఇవ్వలేదన్నారు.స్త్రీ నిధి పథకం అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాలన్న మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యలు దారుణమన్నారు.తల్లికి వందనం పథకం లో అరకొరగా లబ్ధిదారులకు అందించారన్నారు. నిబంధనల పేరుతో లక్షల మంది లబ్ధిదారులకు కోత విధించారన్నారు .రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను, అన్ని కులాల వారికి మోసం చేసిన ఘనత చంద్రబాబు కే దక్కుతుందన్నారు.సొమ్ము ఒకడిది సోకు ఒకరిది అన్న రీతిలో చంద్రబాబు పాలన ఉందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ పథకాలపై అసలు ఊసే లేదని రవీంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జనపాడు లో సమగ్ర ఆరోగ్య ప్రచార కార్యక్రమం

పిడుగురాళ్ల, :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ వారి యొక్క ఆదేశానుసారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో భాగమైన డిస్ట్రిక్ట్ ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్ఐవి/ఎయిడ్స్ (దిశా), గురువారం పల్నాడు జిల్లా పిడుగురాళ్లలోని జనాపాడు గ్రామంలో 104 వైద్య బృందం యొక్క సమన్వయంతో ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంపెయిన్ (సమగ్ర ఆరోగ్య ప్రచారం కార్యక్రమం) విజయవంతంగా నిర్వహించబడింది. ఈ ప్రచారంలో భాగంగా, సాధారణ ప్రజలకు మరియు వనరబుల్ జనాభాకు హెచ్ఐవి మరియు సిఫిలిస్ మరియు హెపటైటిస్ బిడ సి పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించడం జరిగింది.ఈ ఇంటిగ్రేటెడ్ హెల్త్ కాంపెయిన్ (సమగ్ర ఆరోగ్య ప్రచార కార్యక్రమం) లో పీహెచ్ మేడికల్ ఆఫీసరు డాక్టర్ ప్రభావతి, పిడుగురాళ్ల ఐసిటీసి కౌన్సెలర్ నాగరాజు మరియు ఐసీటీసీ ల్యాబ్ టెక్నీషియన్ జయలక్ష్మి,లింకవర్కర్ స్కీమ్ జోనల్ సూపెర్వైసర్ విశ్వశ్వరావు,లింకవర్కర్ దీనకుమారి మరియు రీడ్స్ టి. ఐ ఔట్రీచ్ వర్కర్ శేషు, రీడ్స్ సి.యస్‌సిసియల్ ఎచ్ మున్ని మరియు యమ్. యల్. హెచ్. పి సునీత,ఏ.యన్.యమ్ భారతి మరియు ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

# ప్రేమ గుడ్డిది...మూగది...

## అవును... 40 ఏళ్ల టీచర.. 20 ఏళ్ల స్టూడెంట్ తో

తిరుపతి జూలై 24 ప్రేమ హద్దులు మీరింది. వయస్సుతో సంబంధం లేకుండా చేసింది. పూతలపట్టు దగ్గరలో ఉన్న ఒక ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ స్టూడెంట్ అక్కడ పనిచేసే స్టాఫ్ మధ్య ప్రేమకు దారి తీసింది. చిత్తూరు దుర్గానగర్ కాలనీకి చెందిన 20 ఏళ్ల యువకుడు బీటెక్ చదువుతూ ప్రేమలో పడ్డాడు. ప్రేమించింది క్లాస్‌మేట్‌ను కాదు. ఆ కాలేజీ ల్యాబ్‌లో పనిచేస్తున్న దాదాపు 40 ఏళ్ల వయస్సు ఉన్న మహిళా ఉద్యోగిని ఆకర్షించాడు. పెళ్లయి భర్త నుంచి విడిపోయి జీవనం సాగిస్తున్న సదరు మహిళ అదే కాలేజీలో నాన్ టీచింగ్ స్టాఫ్‌గా పని చేస్తోంది. రోజూ కాలేజీకి వెళుతున్న విద్యార్థికి ఆ మహిళతో పరిచయం ఏర్పడింది. అది కాస్తా ప్రేమగా మారింది. ఇద్దరి మధ్య వయస్సు సగం తేడా ఉన్నా.. వీళ్ల మధ్య స్నేహం కొనసాగింది. అయితే పెళ్లికి సమాజం ఒప్పుకోదని భావించిన ఇద్దరు.. తమకు అభ్యంతరం చెప్పని చోటుకు వెళ్లిపోవాలని భావించారు. ఈ మేరకు మూడు రోజుల క్రితం బెంగళూరుకు వెళ్లిపోయారు. కాలేజీకి వెళ్లిన కొడుకు ఇంటికి తిరిగి రాకపోవడంతో మూడు రోజులుగా ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు.. చిత్తూరు టూ టౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తుండగా.. అసలు విషయం బయటప డింది.సాంకేతికఆధారంగా పోలీసులు గుర్తించారు. చిత్తూరుకు వెళ్లి ఇద్దరిని గుర్తించిన పోలీసులు తిరిగి తీసుకొచ్చారు. తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేసిన పోలీసులు తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. 20 ఏళ్ల స్టూడెంట్ పేరెంట్స్‌కు, 40 ఏళ్ల మహిళ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చిన పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. పోలీసులు.. 40 ఏళ్ల కాలేజీ స్టాఫ్ మహిళ ప్రేమ బ్రేకప్ అయ్యింది. కాలేజీలో జరిగిన యవ్వారం బయట పడడంతో స్టూడెంట్స్, కాలేజీ స్టాఫ్ ఆశ్చర్యానికి లోనయ్యారు.

# అకతాయి యువత పై డ్రోన్ కేమరాలతో నిఘా ఉంచండి.... జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 24 - జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆద్వర్యంలో గురువారం జిల్లాలోని అన్ని సబ్ డివిజన్ లలో శిక్షణ పొందిన డ్రోన్ ఆపరేటర్లతో (పోలీస్ సిబ్బంది) జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆధునిక టెక్నాలజీని వినియోగించుకొని మీకు అప్పగించిన విధులలో నైపుణ్యాన్ని ఏ విధంగా పెంచుకోవాలో వీడియోలు ఫోటోల రూపంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా దిశా నిర్దేశం చేశారు .ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పండుగలు, ఊరేగింపులు,ధర్నాలు,ఈవ్ టీజింగ్ నియంత్రణ, ట్రాఫిక్ మరియు నేర నియంత్రణ,ప్రకృతి విపత్తులలో,చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిఘా కొరకు ఇలా సందర్భం ఏదైనా నేర నియంత్రణే లక్ష్యంగా డ్రోన్ కెమెరాలతో నిఘా ఉండాలన్నారు. గ్రామ/పట్టణ శివారు ప్రాంతాలలో మరియు క్రైమ్ పోర్న్ ఏరియాలలో యువత బహిరంగ మద్యం, గంజాయి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా నియంత్రించేందుకు పోలీస్ లతో కలిసి విధులు నిర్వహించాలన్నారు ..స్కూల్/ కళాశాలలు ప్రారంభ సమయాలలో మరియు సాయంకాల వేళలో డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచి ఈవ్ టీజింగ్ ను అరికట్టేలా గస్తీ నిర్వహించాలన్నారు.ఆధునిక టెక్నాలజీని ఉపయోగించుకొని మీరు నిర్వహించే విధులలో నైపుణ్యాన్ని ఏ విధంగా పెంచుకోవాలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వీడియోల రూపంలో జిల్లాలోని డ్రోన్ ఆపరేటర్లకు (పోలీస్ సిబ్బందికి) జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా దిశ నిర్దేశం చేశారు .ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గారితో పాటు స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

## సకల జీవుల మనుగడకు చెట్లే ఆధారం



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-ఈ భూమ్మీద ఉండే సకల జీవుల మనుగడకు చెట్లే ఆధారమని, ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని డోన్ ప్రభుత్వ గైనకాలజిస్ట్ డాక్టర్ రమ్యశిల్ప, రాష్ట్ర వాల్మీకి సంఘం డైరెక్టర్ వలసల రామకృష్ణ అన్నారు. స్ఫూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో డోన్ లో గల మహాత్మ గాంధీ జ్యోతి రావ్ బాపూలే గురుకుల బాలికల పాఠశాల నందు గురువారం నాడ మొక్కలు నాటే కార్యక్రమంకి ముఖ్య అతిథులుగా హాజరైన పాఠశాల సిబ్బంది స్ఫూర్తి సభ్యులతో కలిసి మొక్కలు నాటారు, ఈ కార్యక్రమానికి మొక్కలు ప్రధానం చేసిన మెహతాజ్ షోరూం జహంగీర్ ని వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, స్ఫూర్తి సభ్యులు మధు, భాస్కర్, చంద్ర, మోహన్ రెడ్డి, జహంగీర్, టీచర్ రంగనాథ్, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలపై అవగాహన....



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-డోన్ రూరల్ సీఐ రాకేష్ గురువారం మండల పరిధిలోని చిన్న మల్కాపురం జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు మత్తు పదార్థాలు, బాల్యవివాహాలు మరియు సైబర్ క్రైమ్ మొదలగు అసాంఘిక కార్యకలాపాలపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశలో తప్పుదారిన నడవడం వలన వారి జీవితాలను వారి బ్రష్టు పట్టించుకోవడం జరుగుతుందని సమాజంలో కుటుంబానికి సైతం పరువు మర్యాదను తీసిన వారవుతారని, ప్రతి విద్యార్థి అనుకోవటం నడుచుకుంటూ బాగా చదువుకుని మంచి భవిష్యత్తును పొందాలని తెలిపారు.

## అన్న క్యాంటీన్ల పరిశీలన




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 24-: అన్న క్యాంటీన్లను మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న గురువారం పరిశీలించారు. పట్టణంలోని బస్టాండ్ వద్ద. ఆస్పత్రి వద్ద ఉన్న అన్న క్యాంటీన్లను కమిషనర్ పరిశీలించారు. భోజన నాణ్యత క్యాంటీన్ ధరల పట్టిక, తాగునీరు, మరు గుదోడ్లు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అన్న క్యాంటీన్లను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. శానిటేషన్ సూపరైజర్ మురళీధర్. లక్ష్మినారాయణ కమిషనర్ వెంట ఉన్నారు .

## పారిశుధ్య పనులు తనిఖీలు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 24--- పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తనిఖీలు చేశారు. గురువారం పట్టణంలో పలు కాలనీల్లో పారిశుధ్య పనులను తనిఖీలు చేసారు . కమిషనర్ మాట్లాడుతూ కాలువల్లో వ్యర్థాలు చెత్త చెదారం వేయడం వల్ల మురికి కాలువలు నిండి పోతున్నాయని ఆయన అన్నారు . ప్రజలు చెత్త చెదారం కాల్వల్లో వేయడం మానుకోవాలని సూచించారు. శానిటేషన్ వర్కర్స్ కు పలు సూచనలిచ్చారు. కమిషనర్ వెంట శానిటేషన్ సూపరైజర్ మురళీధర్. ఇన్ స్పెక్టర్లు లక్ష్మినారాయణ. శివ ప్రసాద్ రెడ్డి. సచివాలయ సిబ్బంది. మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికి రీసర్వే పరిష్కార మార్గం

### ---వెంకటేశ్వర రావు భూమి మరియు సర్వే సంచాలకులు






--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 24 - భూ సమస్యల పరిష్కారానికి రీసర్వేలో పరిష్కార మార్గం ఉంటుందని ప్రాంతీయ సంయుక్త సంచాలకులు సర్వే మరియు భూమి రికార్డుల శాఖ వేంకటేశ్వర రావు పేర్కొన్నారు. గురువారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక, కలెక్టర్ కార్యాలయము లో సర్వేయంత్రాంగంతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశం నందు భూ సమస్యలుపరిష్కరించుటకు భూ యజమానులకు రీసర్వే ఒక మంచి పరిష్కార వేదిక అని ఆయన అన్నారు. కాబట్టి భూ యజమానుల సహాయ సహకారాలతో సర్వే బృందం అత్యంత ప్రామాణిక నాణ్యతతో సర్వే చేయాలనిప్రభుత్వము సెప్టెంబర్ 2027 లోపు రాష్ట్రమంతా భూముల రీసర్వే పూర్తి చేయాలని సంకల్పించిందన్నారు . గ్రామ సర్వేయర్లు ఆధునిక సర్వే సాంకేతిక పరికరాలతో సంబంధిత సాఫ్ట్వేర్ ని ఉపయోగించిఖచ్చితత్వంతో రికార్డులను తయారు చేయాలన్నారు. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఏదైనాసమస్య వచ్చినా వారికి అర్థమయ్యేటట్లు వివరించి చెప్పాలని నిర్దేశించిన సమయంలోపు రైతులదరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామ సర్వేయర్లు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేసిదిశా నిర్దేశం చేసారు. రీసర్వే గ్రామాల రికార్డులను పరిశీలించి సంతృప్తి చెందారు . ఈ సమావేశంలోజిల్లా సర్వే మరియు భూమి రికార్డుల శాఖ అధికారి పీ వి. జయరాజు మరియు ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే ,డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే వారు మండల సర్వేయర్లు మరియు గ్రామ సర్వేయర్లుపలుగొన్నారు.

## ప్రతి గురువారం నేత్ర దర్శనం



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 24- శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారికి ప్రతి గురువారం నేత్ర దర్శనం అలంకరణ తో భక్తులకు దర్శనం ఇస్తారని కోదండ రామాలయం భగవత్ సేవా సమాజ్ కమిటీ సభ్యులు తెలిపారు. విశేష పూజలు నిర్వహించారు. ఉదయం దేవ తామూర్తుల మూలనిరాక్షకు పంచామా జాబి షేకాలు పుష్పాలతో అలంకరణ చేయగా భక్తులు దర్శించుకున్నారు. .

## రెడ్ క్రాస్ సొసైటీ సర్వ సభ్య సమావేశం వాయిదా



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతి నిధి జూలై 24-శనివారం జరగ వలసిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, నంద్యాల జిల్లా సర్వసభ్య సమావేశము అనివార్యకారణము ల వలన నిరవధికముగా వాయి దా వేయబడినదని జిల్లా కలెక్టర్ జి రాజకుమారి గణియా గురు వారం ఒ ప్రకటన విడుదల చేశా రు . తదుపరి సమావేశము జరు గు తేది మరియు ఇతర వివం ములు సభ్యులు మరియు ఇతర గౌరవ సభ్యులకు పత్రికాముఖముగా తెలియజేస్తామని అన్నారు.

# పోలీసుస్టేషన్ లలో సాంకేతికతను బాగా వినియోగించాలి

**నేర నియంత్రణకు గట్టిగా పని చేయాలి**
**డ్రగ్స్ వద్దు బ్రో కరపత్రాలను విడుదల**
**మాదకద్రవ్యాల వినియోగానికి అడ్డుకట్ట వేయాలి**
**కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్**







విభారె న్యూస్ కర్నూలు, జూలై 24 శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు సీరియస్ గా పని చేస్తనే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం ఉండదని కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ లు తెలిపారు. ఈ సంధర్బంగా గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లాలోని డిఎస్పీలు, సిఐలు, ఎస్సైల తో అర్ధ వార్షిక నేర సమీక్షా సమావేశం నిర్వహించి పోలీసు అధికారులతో మాట్లాడారు. కర్నూలు రేంజ్ డిఐజి మాట్లాడుతూ జిల్లాల విభజన తర్వాత కర్నూలు రేంజ్ లో కర్నూలు జిల్లాలో ప్రశాంతమైన వాతావరణం ఉందన్నారు. పాత కక్షలు లేకుండా అందరికి కౌన్సిలింగ్ చేయాలన్నారు.ఎక్కడైనా అల్లర్లు జరగకుండా, ఓపెన్ డ్రింకింగ్ వంటివి లేకుండా డ్రోన్ కెమెరాలతో నిఘాతో విజిబుల్ పోలీసింగ్ కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పోలీసు అంటనే భద్రత అనే విధంగా పోలీసుస్టేషన్ లు బాగా పని చేయాలన్నారు. పోలీసుస్టేషన్ లలో భాదితులకు న్యాయం జరిగితే పోలీసు ఉన్నతాధికారులను బాధితులు ఆశ్రయించే అవకాశం ఉండదన్నారు. న్యాయం జరగక పోతేనే పోలీసు ఉన్నతాధికారులను భాదితులు ఆశ్రయిస్తారన్నారు. సాంకేతిక నైపుణ్యం బాగా పెంచుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ కేసుల గురించి ఆరా తీశారు. పోలీసుస్టేషన్ లలో సాంకేతికతను వినియోగించి నేరాల కట్టడికి గట్టిగా పని చేయాలన్నారు. పోలీస్ స్టేషన్ల లలో, పరిధిలలో సిసి కెమెరాలు బాగా పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్లో పరిధిలలో నేర నివారణకు ముందస్తు జాగ్రత్తల చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన చోట పిడి యాక్టులు, బైండోవర్లు, రౌడిషీటర్లకు కౌన్సిలింగ్ చేయాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్ , ఓపెన్ డ్రింకింగ్, యాంటీ ఈవ్ టీజింగ్ తనిఖీలను డ్రోన్ కెమెరాలతో ఇంకా బాగా చేయాలన్నారు. ప్రాపర్టీ కేసులలో రికవరీలు చేయాలన్నారు. ప్రాపర్టీ కేసులలో నిందితుల వేలి ముద్రల ను సేకరించి చేధించాలన్నారు. కోర్టులో ఉన్న పెండింగ్ కేసులను త్వరగా ట్రయల్ కు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. భాదితులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పోక్సో కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. సిసి టిఎన్ ఎస్ లో ఫైల్స్ అప్ లోడ్ , ఈ ? సమన్స్, ఈ సాక్ష్యా యాప్ ల వంటి టెక్నాలజిని బాగా ఉపయోగించాలన్నారు. అనంతరం గత నెలలో వివిధ కేసులలో ప్రతిభ కనబరచిన పోలీసు అధికారులు, పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ ప్రశంసా పత్రాలను అందజేశారు. జిల్లాలో గత ఆరు నెలలుగా చోటు చేసుకున్న నేరాల విశ్లేషణ, దర్యాప్తు పురోగతి, నేరాల నివారణకు తీసుకున్న చర్యలపై సమగ్ర సమీక్ష చేపట్టారు.గత 6 నెలల కాలంలో నమోదైన క్రైమ్ గణాంకాల విశ్లేషణ జరిపారు. పోలీసు అధికారులు, సిబ్బంది యొక్క పనితీరు సంతృప్తికరంగా ఉందని, ఇదే పనితీరు మునుముందు కొనసాగిస్తూ అందరి సమిష్టి కృషితో బాధితులకు న్యాయం చేసే దిశగా ముందడుగు వేయాలన్నారు. ఈగల్ టీం ఆధ్వర్యంలో గంజాయి కి, డ్రగ్స్ కి గుడ్ బై చెబుదాం , డ్రగ్స్ వద్దు బ్రో , మాదకద్రవ్యాల వినియోగాన్ని కట్టడి చేయాలనే కరపత్రాలను కర్నూల్ రేంజ్ డీఐజీ, జిల్లా ఎస్పీ చేతుల మీదుగా ఆవిష్కరణ చేశారు. జిల్లాలో గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు ప్రజలు అటువంటి సమాచారంను టోల్ ఫ్రీ నెంబర్ 1972 కి సమాచారం అందించాలని తెలియజేశారు. ఈ నేర సమీక్షా సమావేశంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, డిఎస్పీలు బాబు ప్రసాద్, వెంకట్రామయ్య, శ్రీనివాసాచారి, ఉపేంద్రబాబు, హేమలత , ఏ ఆర్ డి ఎస్ పి భాస్కర్ రావు , సిఐలు , ఎస్సైలు, ఈగల్ టీం ఎస్సై సుజన్ కుమార్, ఈగల్ టీం సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరునికి ప్రత్యేక పూజలు

### 150 లీటర్ల తో స్వామి వారికి పాలాభి షేకం



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 24 - పాణ్యం మండలంలోని ఎస్. కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి ఆలయ ఈవో యం. రామక్రిష్ణ ఆధ్వర్యంలో గురు వారం ఆషాఢ అమావాస్యను పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, నాగలింగేశ్వర స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు కంపమల్ల వీరయ్య శర్మ, నారాయణ శర్మ, కంపమల్ల సురేష్ శర్మ ఆధ్వర్యంలో ప్రాతఃకాల పూజలు, గందం అభిషేక పూజలు మరియు 150 లీటర్ల తో పాలాభిషేకం, రుద్రాభిషేకం, అర్చన కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. విచ్చేసిన భక్తాదులందరూ విశేషంగా స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190